కొత్తస్వరం దినపత్రిక
తెలుగు దినపత్రికకు
విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి ఉత్సాహవంతులైన విలేకరులు కావలెను.
సంప్రదించండి:
ఆంధ్ర ప్రదేశ్: 9492813364
తెలంగాణ: 9848095151

www.kothaswaram.com
PRGI No. APTEL/2010/31893
కొత్తస్వరం
KOTHASWARAM
తెలుగు దినపత్రిక
ఆదివారం, ఆగస్టు 02, 2026
ఆంధ్రప్రదేశ్
సంపుటి :16 (Vallume :16) | సంచిక : 59 (Issue :59) | పేజీలు : 04 (Pages 4) | వెల : రూ. 2.00/- (Rs : 2.00/-)
Published from : Kurnool | Vijayawada | Hyderabad




# ఉత్తరాంధ్రకు భోగాపురం కొత్త రన్‌వే: మోదీ

- రూ.18 వేల కోట్ల అభివృద్ధి పనులకు ప్రధాని శ్రీకారం
- భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు
- 13 వేల గిరిజన మహిళల థింసా నృత్యం ప్రపంచ రికార్డు అని ప్రశంస
- చంద్రబాబు దార్శనికతను అభినందించిన ప్రధాని
- ఆంధ్ర యువత భవిష్యత్తుకు లాంచ్‌ప్యాడ్‌గా ఎయిర్‌పోర్ట్ అభివర్ణన

**విజయనగరం, ఆగస్టు 1 (కొత్త స్వరం):**

పవిత్రమైన ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధాని, సింహాచలం అప్పన్న స్వామి, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. నేటి రోజు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో, ముఖ్యంగా స్వర్ణాంధ్ర విజన్‌లో కీలకమైన రోజని పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యమైన థింసా తనకు మధురానుభూతిని కలిగించిందని, ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు ఈ నృత్యం చేసి ప్రపంచ రికార్డు సృష్టించడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ నృత్యంలో తరతరాల వారసత్వం ప్రతిబింబించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను హృదయపూర్వకంగా అభినందించిన ప్రధాని, భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వేగా, ఆంధ్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు లాంచ్‌ప్యాడ్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. గతంలో దేశంలో నిర్మించిన విమానాశ్రయాలకు ఒకే కుటుంబం పేర్లు పెట్టేవారని, తమ ప్రభుత్వం మాత్రం మహనీయుల పేర్లను పెడుతోందని చెప్పారు. అయోధ్య విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి, పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేర్లు పెట్టామని, అదే విధంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు ఖరారు చేసినట్లు వెల్లడించారు. ఈ అభివృద్ధి ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను మరింత వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తాయని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.




# భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్రకు కొత్త దశ

- చంద్రబాబు, మోదీ, పవన్ సందేశం ఒక్కటే.. అభివృద్ధే లక్ష్యం
- ఉత్తరాంధ్రకు మణిహారంగా భోగాపురం విమానాశ్రయం: సీఎం
- రూ.18 వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం
- ఉత్తరాంధ్ర ఏవియేషన్ హబ్‌గా భోగాపురం: రామ్మోహన్ నాయుడు
- రాష్ట్ర అభివృద్ధికి బలమైన నాయకత్వమే కారణం: పవన్ కళ్యాణ్
- పెట్టుబడులు, ఉపాధితో ప్రాంత రూపురేఖలు మారనున్నాయన్న నేతలు





**భోగాపురం, ఆగస్టు 1 (కొత్త స్వరం):**

భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం ఉత్తరాంధ్ర అభివృద్ధికి నూతన అధ్యాయంగా నిలిచిందని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా విమానాశ్రయాన్ని ప్రారం భించడంతో పాటు సుమారు రూ.18 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహా రమని, ఈ ప్రాంత భవిష్యత్తును మార్చే శక్తి దీనికి ఉందని అన్నారు. భూములిచ్చిన రైతులకు కృతజ్ఞ తలు తెలుపుతూ, 2027 నాటికి పోలవరం, 2028 నాటికి అమరావతి తొలి దశ పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు భోగాపురం ఉత్తరాంధ్రకు అభివృద్ధి ద్వారమని, ఏవియేషన్ హబ్‌గా ఎదిగి ప్రపంచ పెట్టుబడులను ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం బలమైన నాయకత్వానికి మద్దతుగా కూటమి ఏర్పాటుకు కృషి చేశానని, మౌలిక సదుపాయాల విస్తరణ ద్వారానే రాష్ట్రం, దేశం వేగంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. భోగా పురం విమానాశ్రయం, కొత్త ప్రాజెక్టులు ఉత్తరాం ధ్రలో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకా శాలను పెంచి ప్రాంత ఆర్థికాభివృద్ధికి బలమైన పునాదులు వేస్తాయని ముగ్గురు నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.






## హెచ్ఐవీ చికిత్సలో కొత్త ముందడుగు

- వీహెచ్-499 ఔషధం తొలి క్లినికల్ పరీక్షల్లో ఆశాజనక ఫలితాలు
- 23 మందిపై నిర్వహించిన ఫేజ్-2ఏ ట్రయల్‌లో వైరల్ లోడ్ తగ్గుదల
- తీవ్రమైన దుష్ప్రభావాలు కనిపించలేదని వెల్లడించిన పరిశోధకులు
- లెనాకాపవిర్‌కు ప్రత్యామ్నాయంగా మారే అవకాశాలపై ఆశలు
- ఫేజ్-3 పరీక్షల అనంతరమే సాధారణ వినియోగంపై తుది నిర్ణయం

2




## అజిత్ దోవల్‌కు లోక్‌మాన్య తిలక్ పురస్కారం

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా జాతీయ అవార్డు ప్రదానం
- పుణేలో తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా ఘన కార్యక్రమం
- జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పాటు రూ.1 లక్ష నగదు బహుమతి
- దేశ భద్రత, కౌంటర్ టెర్రరిజంలో సేవలకు గుర్తింపుగా అవార్డు
- దౌత్య, ఇంటెలిజెన్స్ రంగాల్లో విశిష్ట సేవలకు మరో గౌరవం

2

# భోగాపురం ఎయిర్‌పోర్టుపై క్రెడిట్ వివాదం

- ప్రాజెక్టు విజయంపై వైసీపీ ఆసక్తికర ట్వీట్
- భోగాపురం ఎయిర్‌పోర్టుకు పునాది వేసింది జగనేనని వైసీపీ వ్యాఖ్య
- అన్ని కీలక అనుమతులు జగన్ హయాంలోనే వచ్చాయని వెల్లడి
- ప్రాజెక్టు విజయంలో చంద్రబాబు పాత్ర లేదని విమర్శలు
- ప్రారంభోత్సవం అనంతరం రాజకీయంగా వేడెక్కిన క్రెడిట్ వార్

**అమరావతి, ఆగస్టు 1 (కొత్తస్వరం):**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని శనివారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన నేపథ్యంలో ప్రాజెక్టు క్రెడిట్‌పై రాజకీయ వివాదం చెలరేగింది. ఈ సందర్భంగా వైసీపీ ఎక్స్ వేదికగా స్పందిస్తూ భోగాపురం ఎయిర్‌పోర్టు సాకారమవ్వడంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తరఫున రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలిపింది. ఈ ప్రాజెక్టుకు పునాది వేసి కలను నిజం దిశగా నడిపించిన నాయకుడు ఎవరో రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా తెలుసని పేర్కొంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి నాయకులు ఎలాంటి పాత్ర లేకుండానే మొత్తం క్రెడిట్ తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. జగన్ ప్రభుత్వం హయాంలోనే ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం రూ.1,200 కోట్లు వెచ్చించి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేశామని, నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లింపుల్లోనూ తమ ప్రభుత్వమే ముందడుగు వేసిందని వెల్లడించింది. ప్రాజెక్టుకు అవసరమైన కీలక పర్యావరణ, విమానయాన అనుమతులను కూడా జగన్ హయాంలోనే వేగంగా సాధించామని తెలిపింది. ఎయిర్‌పోర్టుకు అనుసంధానంగా రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి నాటి ప్రభుత్వమే శ్రీకారం చుట్టిందని, అందువల్ల ఈ ప్రాజెక్టు విజయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాత్ర లేదని వైసీపీ విమర్శించింది.



# మెట్రో-ఆర్టీసీకి ఒకే టికెట్..!

- హైదరాబాద్‌లో ఉమ్మడి టికెటింగ్ విధానంపై ప్రభుత్వ కసరత్తు
- ప్రయాణికుల సౌకర్యం కోసం కామన్ మొబైల్ యాప్‌కు ప్రతిపాదన
- రోజువారీ, వారపు, నెలవారీ మెట్రో పాస్‌లపై పరిశీలన
- అదనపు మెట్రో కోచ్‌ల కొనుగోలు ప్రక్రియ వేగవంతానికి ఆదేశాలు

**హైదరాబాద్, ఆగస్టు 1 (కొత్తస్వరం):**

హైదరాబాద్‌లో ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఒకే టికెట్‌తో ప్రయాణించే వెసులుబాటును అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ అధ్యక్షతన జరిగిన హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చించారు. ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో, ఆర్టీసీ సేవలను అనుసంధానిస్తూ 'కామన్ మొబిలిటీ టికెటింగ్' విధానాన్ని రూపొందించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం టీజీఎస్ఆర్టీసీ అధికారులతో సంప్రదింపులు జరిపి, ప్రయాణికులందరికీ ఉపయోగపడేలా ఒక ఉమ్మడి మొబైల్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే మెట్రో ప్రయాణికుల కోసం రోజువారీ, వారపు, నెలవారీ ట్రావెల్ పాస్‌లను ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలించాలని కోరారు. మెట్రో నెట్‌వర్క్ విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు మెట్రో కోచ్‌ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో మెట్రో రెండో దశ (ఫేజ్-2)కు సంబంధించిన భూసేకరణతో పాటు ఇతర పనుల పురోగతిని కూడా సమీక్షించారు.



# పోలీస్ నియామకాలకు దరఖాస్తులు ప్రారంభం

- తెలంగాణలో 7,437 పోలీస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల
- ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- పోలీస్, ఎస్పీఎఫ్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో ఖాళీల భర్తీ
- నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసిన టీఎస్ఎల్పీఆర్బీ

**హైదరాబాద్, ఆగస్టు 1 (కొత్తస్వరం):**

తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ తేదీలను ఖరారు చేసింది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్పీఆర్బీ) నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లను విడుదల చేసింది. మొత్తం ఖాళీల్లో అత్యధికంగా కానిస్టేబుల్, ఆపై స్థాయి ఉద్యోగాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పోస్టుల వివరాల ప్రకారం సివిల్ ఎస్ఐ-148, ఏఆర్ ఎస్ఐ-14, టీజీఎస్పీ ఏఆర్ ఎస్ఐ-12, ఎస్ఏఆర్ సీపీఎల్ ఎస్ఐ-3, ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్ఐ-23, సివిల్ కానిస్టేబుల్-3,697, ఏఆర్ కానిస్టేబుల్-1,052, ఎస్ఏఆర్ సీపీఎల్ కానిస్టేబుల్-24, కానిస్టేబుల్ (డ్రైవర్) పీటీవో-20, కానిస్టేబుల్ (మెకానిక్) పీటీవో-7 పోస్టులను ఈ నియామకాల ద్వారా భర్తీ చేయనున్నారు.



# హెచ్ఐవీ చికిత్సలో కొత్త ముందడుగు

**వీహెచ్-499 ఔషధం తొలి క్లినికల్ పరీక్షల్లో ఆశాజనక ఫలితాలు**

**23 మందిపై నిర్వహించిన ఫేజ్-2ఏ ట్రయల్‌లో వైరల్ లోడ్ తగ్గుదల**

**లెనాకాపవిర్‌కు ప్రత్యామ్నాయంగా మారే అవకాశాలపై ఆశలు**

**ఫేజ్-3 పరీక్షల అనంతరమే సాధారణ వినియోగంపై తుది నిర్ణయం**

**హెల్త్ డెస్క్, ఆగస్టు 1 (కొత్తస్వరం):**

హెచ్ఐవీ చికిత్సలో మరో కీలక ముందడుగు పడింది. వీహెచ్-499 పేరుతో అభివృద్ధి చేసిన కొత్త ఔషధం తొలి మానవ క్లినికల్ పరీక్షల్లో ఆశాజనక ఫలితాలు ఇవ్వడంతో పరిశోధకులు కొత్త ఆశలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మందు హెచ్ఐవీ-1 వైరస్ శరీరంలో విస్తరించకుండా అడ్డుకోవడంలో సమర్థంగా పనిచేసినట్లు వెల్లడించారు. ఈ అధ్యయన ఫలితాలు 'క్లినికల్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. హెచ్ఐవీ వైరస్‌ను కప్పి ఉంచే క్యాప్సిడ్ ప్రొటీన్‌ను లక్ష్యంగా చేసుకుని వీహెచ్-499 పనిచేస్తుందని, వైరస్ జీవించడానికి, శరీరంలో వ్యాప్తి చెందడానికి కీలకమైన ఈ ప్రొటీన్‌పై ప్రభావం చూపడం ద్వారా వైరస్ పెరుగుదలను అడ్డుకుంటుందని వివరించారు. ఫేజ్-2ఏ క్లినికల్ ట్రయల్‌లో హెచ్ఐవీ-1 బారినపడిన 23 మందిని పరిశీలించగా, వారిలో 20 మందికి వివిధ మోతాదుల్లో వీహెచ్-499, ముగ్గురికి ప్లాసీబో అందించారు. చికిత్స ప్రారంభానికి ముందు అందరిలోనూ వైరస్ స్థాయి ఎక్కువగా ఉండగా, వీహెచ్-499 తీసుకున్న ప్రతి ఒక్కరిలోనూ 11వ రోజుకే వైరల్ లోడ్ గణనీయంగా తగ్గింది. ఎక్కువ మోతాదు తీసుకున్నవారిలో మరింత మెరుగైన ఫలితాలు నమోదయ్యాయి. ప్లాసీబో తీసుకున్నవారిలో మాత్రం పెద్దగా మార్పు కనిపించలేదు. ఈ ఔషధం సురక్షితంగానే ఉందని, ఎలాంటి తీవ్రమైన దుష్ప్రభావాలు కనిపించలేదని పరిశోధకులు తెలిపారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న లెనాకాపవిర్ తరహా ఔషధంతో పోలిస్తే శరీరంలోని సీవైపీ3ఏ4 ఎంజైమ్‌తో వీహెచ్-499కు తక్కువ పరస్పర చర్యలు ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒకేసారి అనేక మందులు వాడే రోగులకు ఇది ప్రయోజనకరంగా మారవచ్చని అభిప్రాయపడ్డారు. అయితే ఈ మందు సాధారణ రోగులకు అందుబాటులోకి రావడానికి ఇంకా సమయం పడుతుందని, పెద్ద ఎత్తున ఫేజ్-3 క్లినికల్ పరీక్షల ద్వారా భద్రత, ప్రభావాన్ని మరింత నిర్ధారించాల్సి ఉందని తెలిపారు. ఆ పరీక్షల్లోనూ విజయవంతమైతే దీర్ఘకాలం పనిచేసే హెచ్ఐవీ చికిత్సల్లో వీహెచ్-499 కీలక ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# భక్తుల భద్రతకు చర్యలు చేపట్టాలి

**శ్రీశైలం దేవస్థానం సరిహద్దులు సర్వే చేసి సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని వినతి**

**వన్యప్రాణుల నుంచి భక్తులను రక్షించేందుకు సమగ్ర భద్రతా ప్రణాళిక కోరిన దేవులుటి కాశీరావు**

**నంద్యాల, ఆగస్టు 01 (కొత్త స్వరం):**

శ్రీశైలం మహాక్షేత్రంలో దేవస్థానం సరిహద్దులను అధికారికంగా సర్వే చేసి ఖరారు చేయడంతో పాటు వన్యప్రాణుల నుంచి భక్తులను రక్షించేందుకు శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సమగ్ర భద్రతా చర్యలు చేపట్టాలని హైకోర్టు న్యాయవాది, సామాజిక కార్యకర్త దేవులుటి కాశీరావు జిల్లా కార్యనిర్వాహణాధికారికి శనివారం వినతిపత్రం అందజేశారు. దేశంలోని ప్రముఖ జ్యోతిర్లింగ, శక్తిపీఠ క్షేత్రాల్లో ఒకటైన శ్రీశైలానికి ప్రతిరోజూ వేలాది మంది, పర్వదినాల్లో లక్షలాది మంది భక్తులు వస్తుండగా, టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉండటంతో అప్పుడప్పుడు వన్యప్రాణులు ఆలయ పరిసరాల్లోకి రావడం భక్తుల్లో ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దేవస్థానం పరిధిలోని మొత్తం భూమిని అధికారికంగా సర్వే చేసి ఖచ్చితమైన సరిహద్దులను నిర్ణయించాలని, శాశ్వత హద్దు రాళ్లు, జియో-రెఫరెన్స్ మ్యాప్‌లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అటవీ శాఖ నిపుణుల సూచనల మేరకు అవసరమైన ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే భక్తులు సంచరించే ప్రాంతాల్లో తగిన లైటింగ్, సీసీటీవీ కెమెరాలు, అత్యవసర సహాయ కేంద్రాలు, కంట్రోల్ రూమ్, భద్రతా సిబ్బందిని పెంచడంతో పాటు వన్యప్రాణులు కనిపించినప్పుడు వెంటనే స్పందించే ప్రత్యేక అత్యవసర ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటు చేయాలని, దేవస్థానం--అటవీ శాఖ--జిల్లా యంత్రాంగం సమన్వయంతో శాశ్వత కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. భారత రాజ్యాంగంలోని అధికరణం 21 ప్రకారం ప్రతి వ్యక్తికి జీవించే హక్కు, సురక్షిత వాతావరణంలో జీవించే హక్కు, అధికరణం 25 ప్రకారం భక్తులు తమ మతాచారాలను సురక్షితంగా నిర్వహించుకునే హక్కు కలిగి ఉన్నందున, భక్తుల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని పై సూచనలను అత్యవసర ప్రాధాన్యంతో అమలు చేయాలని ఆయన కోరారు.

# ఆర్టీసీలో బహుజన జెండా ఎగరేయడమే లక్ష్యం

**ఎన్నికలకు సమాయత్తమవుతున్న బహుజన్ వర్కర్స్ యూనియన్**

**హైదరాబాద్, ఆగస్టు 1 (కొత్తస్వరం) :**

సామాజిక తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం జనరల్ సెక్రటరీ దేవల్ల సమ్మయ్య, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు సతీష్ కొట్టే, అధ్యక్షతన లకిడికపూల్ లోని తెలంగాణ బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొని ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆర్టీసీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అనుబంధ బహుజన్ వర్కర్స్ యూనియన్ ఎన్నికలకు సమగ్ర కార్యాచరణను సిద్ధం చేస్తోంది. చైర్మన్ సంపత్ ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ సాజిద్ నాయకులతో కలిసి ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలి, కార్మికుల్లోకి ఏ విధంగా వెళ్లాలి, ప్రచార వ్యూహం ఎలా ఉండాలి, మేనిఫెస్టోలో ఏ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే విషయాలపై విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**కార్మికుల సమస్యలే ప్రధాన అజెండా..**

ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, సంక్షేమం, పారదర్శక పరిపాలన వంటి అంశాలను ఎన్నికల మేనిఫెస్టోలో ప్రధానంగా పొందుపరచాలని సమావేశంలో నిర్ణయించారు. కార్మికుల విశ్వాసాన్ని పొందేలా బహుజన వర్కర్స్ యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర నాయకులు, తెలంగాణ బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రతినిధులు, బహుజన్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొని ఎన్నికల కార్యాచరణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో బహుజన వర్కర్స్ యూనియన్‌ను విజయతీరాలకు చేర్చేందుకు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నరసయ్య గౌడ్, ప్రముఖ జర్నలిస్ట్ సుదర్శన్ గౌడ్, పార్టీ సహాయ కార్యదర్శి గిరి గాని బిక్షపతి గౌడ్, రాష్ట్ర నాయకులు సుతారపు రంగన్న, స్టేట్ ఆఫీస్ కోఆర్డినేటర్ లింగం యాదవ్, కార్వాన్ నియోజకవర్గ ఇన్చార్జ్ టీవీ ఆర్ తోపాటు బహుజన వర్కర్స్ యూనియన్ సభ్యులు పార్టీ నాయకులు పాల్గొన్నారు

# సోషల్ మీడియా పాత్ర మరువలేనిది: కేటీఆర్



**సోషల్ మీడియా వల్లే ఎన్నో అంశాలు వెలుగులోకి వస్తున్నాయని వ్యాఖ్య**

**యువత వార్తలను రీల్స్ రూపంలో చూస్తోందన్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు**

**పరిశోధనాత్మక జర్నలిజంపై ఆందోళన వ్యక్తం**

**నవతెలంగాణ వార్షికోత్సవ సెమినార్‌లో 'రాజ్యాంగం-ప్రజాస్వామ్యం-పత్రికా స్వేచ్ఛ' అంశంపై ప్రసంగం**

**హైదరాబాద్, ఆగస్టు 1 (కొత్తస్వరం):**

సోషల్ మీడియా పాత్ర నేటి సమాజంలో మరువలేనిదని, అది లేకపోతే ఎన్నో కీలక అంశాలు వెలుగులోకి వచ్చేవి కావని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన 'రాజ్యాంగం--ప్రజాస్వామ్యం--పత్రికా స్వేచ్ఛ' అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. నేటి యువత సంప్రదాయ పత్రికలు, టెలివిజన్ కంటే సోషల్ మీడియా, ముఖ్యంగా రీల్స్ ద్వారానే వార్తలను ఎక్కువగా వీక్షిస్తోందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు గల యువ ఓటర్ల ప్రభావం అధికంగా ఉండబోతుందని అన్నారు. సోషల్ మీడియా వల్లే అధికార వ్యవస్థలో జవాబుదారీతనం పెరిగిందని, పలు ఘటనలు ప్రజల దృష్టికి వచ్చాయని వ్యాఖ్యానించారు. తెలంగాణలో పలు సంఘటనలకు సంబంధించి ప్రధాన స్రవంతి మీడియా తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపిస్తూ, ఒక యువతిపై లైంగిక దాడి ఘటన, లగచర్లలో గిరిజనులపై జరిగిన అకృత్యాలు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అంశం వంటి విషయాలు సోషల్ మీడియా ద్వారానే విస్తృత చర్చకు వచ్చాయని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో స్వేచ్ఛగా, నిర్భీతిగా పరిశోధనాత్మక కథనాలు వెలువడుతున్నాయా అనే ప్రశ్నను లేవనెత్తారు. ప్రభుత్వంలో ఉన్న పెద్దలు జర్నలిస్టుల పట్ల అసహనం వ్యక్తం చేసిన సందర్భాల్లో కూడా మీడియా స్పందించలేదని విమర్శించారు. వాస్తవాలను చెప్పడం కొందరికి నచ్చకపోయినా, ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ, పరిశోధనాత్మక జర్నలిజం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఏడీ చెన్నకేశవుల సస్పెన్షన్‌కు డిమాండ్

**శ్రీకాకుళం ప్రెస్ క్లబ్‌లో జర్నలిస్టుల అత్యవసర సమావేశం**

**అక్రిడేషన్ కార్డుల జాప్యంపై తీవ్ర ఆగ్రహం**

**ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక మీడియాకు ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి**

**జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్య వైఖరిని ఖండించిన సంఘాల ప్రతినిధులు**

**ఆదివారం మరో కీలక సమావేశానికి హాజరు కావాలని పిలుపు**

**శ్రీకాకుళం, ఆగస్టు 1 (కొత్త స్వరం):**

శ్రీకాకుళం జిల్లా సమాచార ఽ పౌర సంబంధాల శాఖలో పనిచేస్తున్న ఏడీ చెన్నకేశవుల వ్యవహార శైలిని నిరసిస్తూ స్థానిక పత్రికల ఎడిటర్లు, సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు శ్రీకాకుళం ప్రెస్ క్లబ్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ జిల్లా డీపీఆర్వో కార్యాలయం జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోవడం లేదని, ముఖ్యంగా అక్రిడేషన్ కార్డుల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన గుర్తింపు, సహకారం, సమాచారంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆరోపించారు. ఇటీవల జరిగిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవం వంటి ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ కార్యక్రమానికి స్థానిక జర్నలిస్టులకు తగిన ఆహ్వానాలు అందించకపోవడం, మీడియా కవరేజ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేయకపోవడం పట్ల సమావేశంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. ఈ విషయంలో సంబంధిత అధికారుల వైఫల్యంపై పలువురు జర్నలిస్టులు అభ్యంతరం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఏడీ చెన్నకేశవులపై ప్రభుత్వం వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టులకు పెండింగ్‌లో ఉన్న అక్రిడేషన్లను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల పట్ల అవమానకరమైన వ్యాఖ్యలు, దురుసు ప్రవర్తన సహించబోమని పేర్కొంటూ, పరిస్థితిలో మార్పు రాకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన వార్తల ప్రచురణపై సమిష్టిగా నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు ఎన్. ఈశ్వరరావు, పేడాడ శ్యాంసుందర్, ఎం.వి. మల్లేశ్వరరావు, గురిగిబిల్లి నాగభూషణ్, డా. డోల. అప్పన్న, బొడ్డేపల్లి రాజేష్, ఆకుల మాధవ, గోందు జనార్దన్‌రావు, కళ్యాణ్ పెద్దకోట, కొంచెం చిన్నారావు, రాము, సింగూరు శ్రీనివాసరావు, బొడ్డ కృష్ణారావు, జిల్లా వాణి ఈశ్వరరావు, పొడుగు రాజు, అద్దంకి సురేష్, బద్రి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రేపు (ఆదివారం) ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం ప్రెస్ క్లబ్‌లో జరగనున్న అత్యవసర సమావేశానికి జర్నలిస్టులు, స్థానిక పత్రికల ప్రతినిధులు అందరూ తప్పనిసరిగా హాజరై ఐక్యతను చాటాలని సమావేశ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.



# విద్యార్థులకు పోలీసుల చేయూత





**పోలూరు జెడ్పీహెచ్ఎస్‌లో డైనింగ్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం**

**విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోవాలని అధికారుల పిలుపు**

**250 మంది విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, నోట్‌బుక్స్, పెన్నులు, చాక్లెట్లు పంపిణీ**

**సామాజిక బాధ్యతలోనూ ముందుంటామని చాటిన పోలీసు శాఖ**

**పోలీసు అధికారులకు హెచ్ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తుల కృతజ్ఞతలు**

**నంద్యాల, ఆగస్టు 1 (కొత్త స్వరం):**

పోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన పోలీసు శాఖ, వారి సౌకర్యార్థం రాతి బండలతో డైనింగ్ ప్లాట్‌ఫామ్‌ను నిర్మించి అందించింది. ఈ ప్లాట్‌ఫామ్‌ను తిరుపతి అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డోన్ డివైఎస్పీ పి. శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి, వారి పక్కనే కూర్చొని భోజనం చేస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు మాట్లాడుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యపై దృష్టి సారించి, క్రమశిక్షణతో చదివి సమాజంలో మంచి పౌరులుగా, ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పోలీసు శాఖ తరపున చిన్న సహాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. డోన్ డివైఎస్పీ పి. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని, దానిని సాధించేందుకు కష్టపడి చదవాలని, మంచి ఆశయాలతో ముందుకు సాగితే ఉన్నత పదవులు అందుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి వాటర్ బాటిల్, రెండు నోట్‌బుక్స్, ఒక పెన్, చాక్లెట్ బాక్స్‌ను పోలీసు అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బేతంచెర్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. విద్యార్థులకు శాశ్వత సౌకర్యంగా డైనింగ్ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేసిన తిరుపతి అదనపు ఎస్పీ, డోన్ డివైఎస్పీతో పాటు సహకరించిన పోలీసు బృందానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దేవనాల శ్రీనివాసులు, మధుసూదనరాజు, జిలానీ, గోపినాయక్, రామచంద్రుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# అజిత్ దోవల్‌కు లోక్‌మాన్య తిలక్ పురస్కారం

**కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా జాతీయ అవార్డు ప్రదానం**

**పుణేలో తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా ఘన కార్యక్రమం**

**జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పాటు రూ.1 లక్ష నగదు బహుమతి**

**దేశ భద్రత, కౌంటర్ టెర్రరిజంలో సేవలకు గుర్తింపుగా అవార్డు**

**దౌత్య, ఇంటెలిజెన్స్ రంగాల్లో విశిష్ట సేవలకు మరో గౌరవం**

**పుణే, ఆగస్టు 1 (కొత్తస్వరం):**

దేశ భద్రత, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లలో విశిష్ట సేవలు అందించిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌కు ప్రతిష్ఠాత్మక 'లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డు' ప్రదానం చేశారు. మహారాష్ట్రలోని పుణేలో బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ రోహిత్ తిలక్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే, సునేత్ర పవార్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అవార్డు కింద జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పాటు రూ.1 లక్ష నగదు బహుమతిని అందజేశారు. దేశ భద్రత, దౌత్యం, ఇంటెలిజెన్స్ రంగాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన 81 ఏళ్ల అజిత్ దోవల్ భారత రక్షణ వ్యవస్థలో కీలక పాత్ర పోషించారు. 'ఆపరేషన్ బ్లాక్ థండర్', డోక్లామ్ వివాద సమయంలో వ్యూహాత్మక దౌత్య చర్చలు, బాలాకోట్ వైమానిక దాడుల రూపకల్పనలో ఆయన పాత్ర విశేషంగా నిలిచింది. 1968 కేరళ కేడర్‌కు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి అయిన దోవల్ మూడు దశాబ్దాలకు పైగా భారత ఇంటెలిజెన్స్ వ్యవస్థలో సేవలందించి, అనంతరం ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. మిజోరం, సిక్కిం, పంజాబ్, జమ్మూకశ్మీర్ వంటి తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలతో పాటు ఇస్లామాబాద్, లండన్‌లోని భారత దౌత్య కార్యాలయాల్లోనూ కీలక బాధ్యతలు నిర్వహించారు. తమ తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించి భారత్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన ప్రముఖులకు ప్రతి ఏడాది ఈ లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డును ప్రదానం చేస్తున్నారు.

# భక్తుల భద్రతకు చర్యలు చేపట్టాలి

**శ్రీశైలం దేవస్థానం సరిహద్దులను అధికారికంగా సర్వే చేయాలని వినతి**

**వన్యప్రాణుల నుంచి భక్తుల రక్షణకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి**

**సీసీ కెమెరాలు, అత్యవసర సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచన**

**దేవస్థానం-అటవీ శాఖ-జిల్లా యంత్రాంగం సమన్వయంతో శాశ్వత కార్యాచరణ కోరిన కాశీరావు**

**నంద్యాల, ఆగస్టు 1 (కొత్తస్వరం):**



శ్రీశైలం మహాక్షేత్రంలో దేవస్థానం సరిహద్దులను అధికారికంగా సర్వే చేసి ఖరారు చేయడంతో పాటు వన్యప్రాణుల నుంచి భక్తుల రక్షణ కోసం శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సమగ్ర భద్రతా చర్యలు చేపట్టాలని హైకోర్టు న్యాయవాది, సామాజిక కార్యకర్త దేవులుటి కాశీరావు జిల్లా కార్యనిర్వాహణాధికారికి శనివారం వినతిపత్రం అందజేశారు. దేశంలోని ప్రముఖ జ్యోతిర్లింగ, శక్తిపీఠ క్షేత్రాలలో ఒకటైన శ్రీశైలం మహాక్షేత్రాన్ని ప్రతి రోజూ వేలాది మంది, పర్వదినాల్లో లక్షలాది మంది భక్తులు సందర్శి స్తున్నారని, టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉండటంతో అప్పుడప్పుడు వన్యప్రాణులు ఆలయ పరిసరాల్లోకి రావడం భక్తుల్లో ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. భక్తుల ప్రాణాలు, భద్రతను పరిరక్షించడం దేవస్థానం, సంబంధిత ప్రభుత్వ శాఖల బాధ్యత అని పేర్కొంటూ దేవస్థానం పరిధిలోని మొత్తం భూమిని అధికారికంగా సర్వే చేసి ఖచ్చితమైన సరిహద్దులను నిర్ణయించాలని, శాశ్వత హద్దురాళ్లు, జియో-రెఫరెన్స్ మ్యాప్‌లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే అటవీ శాఖ నిపుణుల సూచనలతో అవసరమైన ప్రాంతాల్లో శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, భక్తులు సంచరించే ప్రాంతాల్లో తగిన లైటింగ్, సీసీటీవీ కెమెరాలు, అత్యవసర సహాయ కేంద్రాలు, కంట్రోల్ రూమ్, అదనపు భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వన్యప్రాణులు కనిపించినప్పుడు వెంటనే స్పందించే ప్రత్యేక అత్యవసర ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటు చేయడంతో పాటు దేవస్థానం, అటవీ శాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో భక్తుల భద్రత కోసం శాశ్వత కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కోరారు. భారత రాజ్యాంగంలోని అధికరణం--21 ప్రకారం ప్రతి వ్యక్తికి జీవించే హక్కుతో పాటు సురక్షిత వాతావరణంలో జీవించే హక్కు ఉందని, అధికరణం-25 ప్రకారం భక్తులు తమ మతాచారాలను సురక్షితంగా నిర్వహించుకునే హక్కు కలిగి ఉన్నారని పేర్కొంటూ, దేవస్థానం ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించే బాధ్యతను విస్మరించరాదని, భక్తుల ప్రాణ భద్రత దృష్ట్యా ఈ సూచనలను అత్యవసర ప్రాధాన్యంతో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఉల్లిందకొండలో ఘనంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

**లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పెన్షన్లు అందజేసిన అధికారులు, నాయకులు**

**ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహణ**

**పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి ఆధ్వర్యంలో పథకం అమలు**

**అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్ అందజేత**



**కర్నూలు, ఆగస్టు 1 (కొత్తస్వరం):**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, నంద్యాల పార్లమెంట్ టీడీపీ అధ్యక్షురాలు, పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు మండలం ఉల్లిందకొండ గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగ లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్ సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెన్షన్ మొత్తాన్ని పెంచి ప్రతి నెల ఒకటో తేదీన లబ్ధిదారులకు అందజేస్తూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అలాగే పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి నియోజకవర్గవ్యాప్తంగా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు రంగస్వామి రెడ్డి, టీడీపీ యువ నాయకుడు జీవి రాముడు, జిలాని, కరీం, లింగన్న, చంద్ర, సాయి, కొల్లంపల్లి తండా హీరు నాయక్, రవి నాయక్, ఇతర టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

# సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

**మండ్లెం సచివాలయ సిబ్బందిని సస్పెండ్ చేయాలని సీపీఎం డిమాండ్**

**విధి వేళల్లో కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లారంటూ ఆగ్రహం**

**ప్రజలకు అందుబాటులో లేని అధికారులపై కలెక్టర్ జోక్యం కోరిన నాయకులు**

**స్పందించని సిబ్బంది, తహసీల్దార్‌పై అసంతృప్తి వ్యక్తం**

**చర్యలు లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరిక**



**జూపాడు బంగ్లా, ఆగస్టు 1 (కొత్తస్వరం) :**

ప్రజలకు సేవలు అందించాల్సిన మండ్లెం సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారిని వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయనతో పాటు గ్రామస్తులు జి. అంకన్న, జి. నాగశేషులు, ఎం. శివ, ఎస్. కృష్ణ, పార్థసాయి, ధనుష్ తదితరులు సాయంత్రం నాలుగు గంటల సమయంలో పంట మాస్పరి తదితర పనుల నిమిత్తం సచివాలయానికి వెళ్లగా అప్పటికే అధికారులు కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లిపోయారని తెలిపారు. సచివాలయ సిబ్బందికి ఫోన్ చేసిన ప్పటికీ ఎవరూ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న సచివాలయ సిబ్బందిపై కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని విధుల నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. జూపాడు బంగ్లా మండల తహసీల్దార్‌కు ఫోన్ చేసినా సమాధానం ఇవ్వలేదని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనేక గ్రామాల్లో సచివాలయ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ప్రజలు తమ పనులు వదిలిపెట్టి సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆరోపించారు. సచివాలయ వ్యవస్థను సక్రమంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వారు కోరారు.

# మాజీ సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**తిర్లాపురం మాజీ సర్పంచ్ పాయం కామరాజుకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నివాళి**

**విజయనగరంలోని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎమ్మెల్యే**

**కాంగ్రెస్ సర్పంచ్ పాయం చిట్టెమ్మకు ప్రగాఢ సానుభూతి**

**ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు మనోధైర్యం**

**నివాళుల కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు**





**మణుగూరు, ఆగస్టు 1 (కొత్తస్వరం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం విజయనగరం గ్రామంలో నివసిస్తున్న తిర్లాపురం గ్రామ మాజీ సర్పంచ్ పాయం కామరాజు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా దివంగత పాయం కామరాజుకు ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మనోధైర్యం చెప్పడంతో పాటు, భగవంతుడు దివంగత పాయం కామరాజు ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. అనంతరం దివంగత పాయం కామరాజు సతీమణి, తిర్లాపురం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ పాయం చిట్టెమ్మను ప్రత్యేకంగా పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రిలో మురికి గుంత

**రోగులకు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు**

**తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి**

**వనపర్తి, ఆగస్టు 01 (కొత్త స్వరం):**

వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణంలో మురికి గుంత ఏర్పడడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురికి గుంత నుంచి వస్తున్న దుర్వాసన కారణంగా ఆస్పత్రి పరిసరాల్లో అసౌకర్యకర పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్పందించి మున్సిపల్ అధికారులు ఆ మురికి గుంతను తొలగించి, దుర్వాసన లేకుండా అవసరమైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



# వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన









**ముంపు గ్రామాల్లో పరిస్థితులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా**

**సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**

**పునరావాస కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచన**

**ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం**

**బూర్గంపాడు, ఆగస్టు 1 (కొత్తస్వరం):**

గోదావరి వరదలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని బూర్గంపాడు, సారపాక గ్రామాల్లో నీట మునిగిన ప్రాంతాలను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. వరదల కారణంగా ఇళ్లలోకి నీరు చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. వరద ప్రభావిత ప్రజలను తక్షణమే సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి భోజనం, తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర అన్ని మౌలిక సదుపాయాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయ సహకారాలను వేగంగా అందించి, అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం సారపాక గ్రామంలోని వరద ప్రభావిత ప్రాంతాలను కూడా సందర్శించి పరిస్థితిని సమీక్షించి ప్రజలకు ధైర్యం చెప్పారు. తర్వాత గోదావరి నదిపై ఉన్న వంతెనపై నుంచి వరద ప్రవాహాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పంప్ హౌస్ పనులపై ఎమ్మెల్యే సమీక్ష









**మారెళ్లపాడు పంప్ హౌస్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**నాణ్యతతో పాటు గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**

**పంపులు, మోటార్ కప్లింగ్, పైప్‌లైన్ పనుల పురోగతిపై సమీక్ష**

**ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి సమన్వయంతో పూర్తి చేయాలని సూచన**

**ఆయకట్టు రైతులకు సాగునీటి అందుబాటు మెరుగుపడుతుందని ఎమ్మెల్యే వెల్లడి**

**అశ్వాపురం, ఆగస్టు 1 (కొత్తస్వరం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని మారెళ్లపాడు పంప్ హౌస్ వద్ద కొనసాగుతున్న నిర్మాణ పనులను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పంప్ హౌస్‌లో జరుగుతున్న పంపుల ఏర్పాటు (పంప్ ఎరెక్షన్) పనుల పురోగతిని సమీక్షించి, పనులు నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్ ప్రతినిధులను ఆదేశించారు. అనంతరం ప్రధాన పంప్ హౌస్‌లో మోటార్ల కప్లింగ్ పనులను పరిశీలించి, సాంకేతిక ప్రమాణాలను పాటిస్తూ ఎలాంటి లోపాలు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రెషర్ మెయిన్ పైప్‌లైన్ ఏర్పాటు పనుల పురోగతిని పరిశీలించి, పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రెషర్ మెయిన్, తుమ్మల చెరువు ఫీడర్ కాలువ కలిసే ప్రాంతంలో జరుగుతున్న పనులను పరిశీలించి, ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు పూర్తయితే ఆయకట్టు రైతులకు సాగునీటి అందుబాటు మెరుగుపడి వ్యవసాయానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్ ప్రతినిధులు, మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

**అశ్వాపురం మండలంలో ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**వరద బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా**

**సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి**

**మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన**



**అశ్వాపురం, ఆగస్టు 1 (కొత్తస్వరం):**

గోదావరి వరదల ఉధృతి నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని నెల్లిపాక బంజారా, రామచంద్రాపురం గ్రామాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరదల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయక చర్యలను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే కోరారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని, వరద బాధితులకు అవసరమైన సహాయం అందించేందుకు కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులపై తప్పుడు ఆరోపణలు ఆపాలి

**ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు**

**వేధింపులు కొనసాగితే సహించేది లేదన్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్**



**వనపర్తి, ఆగస్టు 01 (కొత్త స్వరం):**

ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కాంట్రాక్ట్ కార్మికులపై తప్పుడు ఆరోపణలు, నిరాధార నిందలు మోపుతూ వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను సహించేది లేదని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్ మండిపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ కార్మికులపై వేధింపులు వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. దొంగతనం ఆరోపణల నేపథ్యంలో వనపర్తి మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పనిచేస్తున్న ఓ పారిశుద్ధ్య కార్మికురాలిని ఉద్యోగం నుంచి తొలగించిన ఘటన అనంతరం ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటనపై స్పందించిన ఆయన, కార్మికుల సమస్యలను పక్కనబెట్టి ఏజెన్సీ కాంట్రాక్టర్ సందీప్ నిర్వహణలోని ఇన్‌చార్జి గోవింద్ కుల ప్రాతిపదికన ఆరోపణలు చేస్తూ తప్పుడు విధానాలను కొనసాగిస్తున్నారని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులపై నిరాధార ఆరోపణలు చేసి వేధింపులకు పాల్పడడం మానుకోవాలని, వారి హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

**నంద్యాల అర్బన్ మండల కార్యాలయాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్**

**రికార్డులను క్రమబద్ధంగా భద్రపరచాలని అధికారులకు ఆదేశం**

**పారదర్శకత, సమర్థతతో కార్యాలయ నిర్వహణపై దృష్టి సారించాలని సూచన**

**ఫైళ్లు, రిజిస్టర్లు, పరిశుభ్రత, రికార్డుల భద్రతపై సమీక్ష**

**ప్రజలకు మెరుగైన సేవలందించేలా కార్యాలయ నిర్వహణ ఉండాలని స్పష్టీకరణ**

**నంద్యాల, ఆగస్టు 1 (కొత్తస్వరం) :**



నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ శనివారం నంద్యాల అర్బన్ మండల కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి రికార్డు గది, కార్యాలయ నిర్వహణ, వివిధ శాఖలకు సంబంధించిన దస్త్రాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను శాఖల వారీగా క్రమబద్ధంగా భద్రపరచాలని, పాత రికార్డులను నియమ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యాలయంలోని ఫైళ్ల నిర్వహణ, రిజిస్టర్లు, కార్యాలయ పరిశుభ్రత, రికార్డుల భద్రత తదితర అంశాలను సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. ప్రజలకు అందించే సేవల్లో పారదర్శకత, వేగం, సమర్థత పెంపొందేలా కార్యాలయ నిర్వహణ ఉండాలని, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో నంద్యాల అర్బన్ తహసీల్దార్‌తో పాటు మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటి వద్దకే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు





**అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సామాజిక పెన్షన్లు అందజేస్తున్న ప్రభుత్వం**

**మంచానికే పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల ఇళ్లకు వెళ్లిన మంత్రి ఫరూక్**

**రైతునగర్‌లో పెన్షన్ల పంపిణీని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

**డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని మంత్రి హామీ**

**పారదర్శకంగా, సమయపాలనతో పెన్షన్ల పంపిణీ చేస్తున్న జిల్లా యంత్రాంగం**

**నంద్యాల, ఆగస్టు 1 (కొత్తస్వరం):**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పథకం ద్వారా ప్రతి నెల మొదటి తేదీ ఉదయం నుంచే అర్హులైన లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందజేస్తున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ తెలిపారు. శనివారం నంద్యాల పట్టణంలోని రైతునగర్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొన్నారు. అనంతరం మంచానికే పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారికి పెన్షన్లు అందజేసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలోని పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హతను బట్టి రూ.4,000, రూ.6,000, రూ.10,000, రూ.15,000 వరకు సామాజిక పెన్షన్లు అందజేస్తున్నామని తెలిపారు. ఉద్యోగాలు, ఉపాధి కోసం పిల్లలు ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఒంటరిగా జీవిస్తున్న వృద్ధులకు ఈ పెన్షన్ ఆర్థిక భరోసాగా నిలుస్తోందని పేర్కొన్నారు. అలాగే పేద కుటుంబాలు నిత్యావసర ఖర్చులు, మందుల కొనుగోలు, వైద్య అవసరాలను తీర్చుకోవడంలో ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. రైతునగర్ గ్రామాన్ని నంద్యాల మున్సిపాలిటీలో విలీనం చేసి 22వ వార్డుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యను స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని, ముఖ్యంగా భారీ వర్షాల సమయంలో మురుగునీటి పారుదల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారని చెప్పారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రైతునగర్‌లో అధిక శాతం కుటుంబాలు వ్యవసాయం, పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నందున వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీని పారదర్శకంగా, సమయపాలనతో నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మంచానికే పరిమితమైన వారు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఇబ్బంది పడకుండా వారి ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందజేయాలని సచివాలయ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**గుండాలనట్టులో అంగన్వాడీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**

**డబ్బాపాల కంటే తల్లిపాలే శ్రేష్ఠమని అంగన్వాడీ టీచర్ వి. రమణ బాయి పిలుపు**

**పాములపాడు, ఆగస్టు 01 (కొత్త స్వరం):**

పాములపాడు మండలంలోని గుండాలనట్టు గ్రామంలో అంగన్వాడీ టీచర్ వి. రమణ బాయి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ గర్భవతిగా ఉన్న సమయంలో పోషకాహారం తీసుకోవడం ఎంతో అవసరమని, మంచి పోషకాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన శిశువు జన్మిస్తాడని తెలిపారు. ప్రసవం అనంతరం వెంటనే శిశువుకు ముర్రుపాలు పట్టించాలని, అవి శిశువుకు రోగనిరోధక శక్తిని పెంపొందించి వివిధ వ్యాధులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కల్పిస్తాయని వివరించారు. తల్లిపాలు శిశువుకు దేవుడిచ్చిన అమూల్యమైన వరమని, వాటిలో ఎలాంటి కల్తీ ఉండదని పేర్కొన్నారు. పుట్టిన శిశువుకు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఇతర ఆహారం లేదా పానీయాలు ఇవ్వకూడదని, అలాగే రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాలను కొనసాగించడం శ్రేయస్కరమని సూచించారు. తల్లిపాలలో మొదట వచ్చే పాలలో సుమారు 90 శాతం నీరు, చివరగా వచ్చే పాలలో అధిక పోషకాలు ఉంటాయని తెలిపారు. డబ్బాపాల కంటే తల్లిపాలే శ్రేష్ఠమని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.







# రూ.2.83 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం

**ఓర్వకల్లులో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి**

**విద్యా రంగ మౌలిక వసతుల విస్తరణకు ప్రాధాన్యం**

**పాఠశాలలు, కళాశాల భవనాలు, మండల విద్యాశాఖ కార్యాలయం ప్రారంభం**

**ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే**

**విద్యా, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న నాయకులు**









**ఓర్వకల్లు, ఆగస్టు 1 (కొత్తస్వరం):**

ఓర్వకల్లు మండల కేంద్రంలో రూ. 2.83 కోట్ల వ్యయంతో పూర్తయిన పలు అభివృద్ధి పనులను పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి, ఏపీ ఈడబ్ల్యూఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ జి. నాగముని, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ జి. నాగముని మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 41.60 లక్షలతో నిర్మించిన ల్యాబ్, రూ. 53 లక్షలతో నిర్మించిన మండల విద్యాశాఖ కార్యాలయ భవనం, రూ. 1.60 కోట్లతో నిర్మించిన కేజీబీవీ జూనియర్ కళాశాల భవనాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద హైవే నుంచి మోడల్ స్కూల్ వరకు రూ. 18 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును కూడా ప్రారంభించారు. ఈ అభివృద్ధి పనులు విద్యా రంగ అభివృద్ధికి, మౌలిక సదుపాయాల మెరుగుదలకు దోహదపడనున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, టీడీపీ మండల కన్వీనర్ బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, జనరల్ సెక్రటరీ భూపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గోవింద్ రెడ్డి, మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సంజీవులు, రవికుమార్, కాంతారెడ్డి, ఎంపీడీవో, ఎమ్మార్వో, ఎస్సై సునీల్ కుమార్, వివిధ గ్రామాల నాయకులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ






**సామర్థ్య వృద్ధి కార్యక్రమాలతో అభివృద్ధికి వేగం ఇవ్వాలని కలెక్టర్ పిలుపు**

**వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు, పర్యాటక రంగాల్లో అపార అవకాశాలు**

**జీఎస్ డీపీ, జీడీడీపీ, జీవీఏ వృద్ధే జిల్లా అభివృద్ధి లక్ష్యమన్న కలెక్టర్**

**అంతర్-శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్న పెహ్లా ఇండియా ఫౌండేషన్**

**నంద్యాల జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడి**

**నంద్యాల, ఆగస్టు 1 (కొత్తస్వరం):**

నంద్యాల జిల్లా సమగ్ర అభివృద్ధికి వ్యవసాయం, పారిశ్రామికం, సేవా రంగాలతో పాటు పర్యాటక రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శనివారం మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో పెహ్లా ఇండియా ఫౌండేషన్/ప్రాజెక్ట్ బృంద సభ్యులు రహీస్, హవిలా, పలక్, ఆర్ద్యా, కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కెపాసిటీ బిల్డింగ్ ఓరియంటేషన్ కార్యక్రమంలో జిల్లా అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించిన అంశాలను కలెక్టర్ సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రాధాన్యం కల్పించేందుకు జిల్లాలో మరిన్ని ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో దాదాపు మూడో వంతు విస్తీర్ణం నల్లరేగడి నేలలతో ఉండటంతో రైతులు సంప్రదాయ పంటల సాగుపైనే ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ ఖరీఫ్‌లో మినుములతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాగి, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, అంజూర, ఖర్జూరం వంటి అధిక ఆదాయాన్నిచ్చే పంటల సాగును విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నామని, నాణ్యమైన ఉత్పత్తులతో నంద్యాల జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే లక్ష్యమన్నారు. పారిశ్రామిక రంగంలో జిల్లాకు ఉన్న ఖనిజ సంపద పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుకూలంగా ఉందని, ఖనిజ ఆధారిత అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సేవా రంగం, పర్యాటక రంగాల్లోనూ జిల్లాకు విశేష అవకాశాలు ఉన్నాయని పేర్కొంటూ శ్రీశైలం, మహానంది, అహోబిలం, యాగంటి, బనగానపల్లి వంటి ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాల్లో పర్యాటకులకు మరింత మెరుగైన వసతి, సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భక్తులు కేవలం దర్శనం ముగించుకుని వెళ్లిపోకుండా జిల్లాలో కొన్ని రోజులు బస చేసే విధంగా "స్లో టూరిజం"ను అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే కృష్ణా నది పరివాహక ప్రాంతం, సహజ వనరులు, ఔషధ మూలికలను వినియోగించుకుని హెల్త్ అండ్ వెల్‌నెస్ టూరిజాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆయుర్వేదం, సిద్ధ, యునానీ వంటి వైద్య విధానాల ఆధారంగా కొత్త అవకాశాలను సృష్టించవచ్చని వివరించారు. జిల్లా సహజ వనరులు, వ్యవసాయ సామర్థ్యం, పారిశ్రామిక అవకాశాలు, పర్యాటక విశిష్టతలను సమన్వయం చేసుకుని సమగ్ర అభివృద్ధి దిశగా కార్యాచరణ చేపడితే నంద్యాల జిల్లా రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. పెహ్లా ఇండియా ఫౌండేషన్/ప్రాజెక్ట్ బృంద సభ్యులు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని తెలిపారు. అంతర్-శాఖల సమన్వయం వల్ల పరస్పరం నేర్చుకునే అవకాశం లభించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అమలులో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. వివిధ శాఖల అధికారులు జిల్లాలోని సమస్యలు, అభివృద్ధి అవకాశాలపై సమగ్ర సమాచారాన్ని అందించడం ద్వారా జిల్లా ప్రొఫైలింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న గణాంకాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో పాటు గత రెండేళ్లలో చోటుచేసుకున్న మార్పులను విశ్లేషిస్తూ గ్రాస్ వ్యాల్యూ యాడెడ్, గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ , గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ వృద్ధికి దోహదపడే కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తున్నామని వివరించారు. రాబోయే రెండు రోజుల్లో నియోజకవర్గాల వారీగా ప్రొఫైలింగ్ పూర్తి చేసి, అనంతరం జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులకు జీడీడీపీ, జీవీఏ అంశాలపై అవగాహన కల్పించే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అన్ని శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య వేడుకలకు ఘన ఏర్పాట్లు






**80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశం**

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచన**

**వేడుకలకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం**

**ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి**

**ప్రభుత్వ పథకాలను ప్రతిబింబించే శకటాల ప్రదర్శనకు ఏర్పాట్లు**

**నంద్యాల, ఆగస్టు 1 (కొత్తస్వరం):**

80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జిల్లా ఎస్పీ సునీల్ షెరాణ్‌తో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, అదనపు ఎస్పీ ఖాదర్ బాషా, జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఆగస్టు 15న జిల్లా స్థాయిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి జిల్లా స్థాయి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నందున అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు, రవాణా శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పరేడ్, గ్రౌండ్ సన్నాహాలను జిల్లా పోలీసు యంత్రాంగం పర్యవేక్షించాలని, ఆగస్టు నెలలో వర్షాల అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మైదానం అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన బాధ్యతలను ఆర్‌డీఓ, మున్సిపల్ కమిషనర్, అర్బన్, రూరల్ తహసీల్దార్లు, మున్సిపల్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులకు అప్పగించారు. సభా వేదిక వద్ద విద్యుత్ అంతరాయం తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలు, విద్యార్థులకు తాగునీటి సౌకర్యాలు సమృద్ధిగా కల్పించాలని, సభా ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని, అత్యవసర వైద్య సేవల కోసం వైద్య సిబ్బంది, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు, స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు ఆహ్వాన పత్రికలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎవరూ మిగిలిపోకుండా కలెక్టరేట్‌లోని జాబితా ఆధారంగా ఆహ్వాన పత్రికలు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. ప్రతి శాఖలో ఉత్తమ సేవలు అందించిన ఇద్దరు ఉద్యోగుల పేర్లను ప్రశంసా పత్రాల కోసం సిఫారసు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా డీఆర్‌డీఏ, డ్వామా, పౌర సరఫరాలు, అటవీ, పర్యాటక, స్త్రీ శిశు సంక్షేమం, వ్యవసాయం, అనుబంధ రంగాలు, జలవనరులు తదితర శాఖలు ఆకర్షణీయమైన శకటాలను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

# రహదారి భద్రతే లక్ష్యం

**ఏడు నెలల్లో 24,846 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదు**

**నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పిలుపు**

**కర్నూలు, ఆగస్టు 01 (కొత్త స్వరం):**

రహదారి ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో జిల్లా వ్యాప్తంగా ప్రతి శనివారం రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2026 జనవరి 1 నుంచి జూలై 31 వరకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జిల్లా పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి మొత్తం 24,846 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. వీటిలో ఓవర్ స్పీడ్‌కు 4,960, హెల్మెట్ లేకుండా వాహనం నడిపినందుకు 3,726, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినందుకు 1,291, డ్రంకెన్ డ్రైవింగ్‌కు 5,155, ఓపెన్ డ్రింకింగ్‌కు 9,296, మైనర్ల డ్రైవింగ్‌కు 59, ట్రిపుల్ రైడింగ్‌కు 359 కేసులు నమోదయ్యాయి. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్పీ సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలు, ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా వ్యాప్తంగా నిరంతరం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.



Edited, Printed, Published by **KEDEM RAVI RAJU,** Printed at 3-151, DAMAGATLA NANDIKOTKURU, KURNOOL, ANDHRA PRADESH - 518432, **VSAR PUBLICATIONS,** 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006, A.P., Editor : **KEDEM RAVI RAJU,** Cell No. 9912213364, Email:kothaswaram2024@gmail.com, **PRGI No. APTEL/2010/31893,** WebSite : www.kothaswaram.com